# హాయ్ మమ్మీ!

## – ఎమ్. హేమలత

''అందరూ వచ్చినట్లేనా..?'' చకచకా పేకముక్కలు కలుపుతూ, అసహనంగా అంది కుముదిని. ఆవిడ కళావతి ఇంటికి వచ్చి అప్పుడే అర్ధగంట దాటిపోయింది. ఇంకా చతుర్ముఖ పారాయణం మొదలెట్టలేదు. కుముదిని మరి వచ్చేదే అందుకు!

''ఉండవమ్మా తల్లీ! మరీ అంత తొందరైతే ఎలా? కౌసల్య రావాలి- కళావతి తెమలాలి. పాపం, కళావతి నొకమారు అటు చూడు- వంటింట్లో ఎలా సతమతమౌతోందో! విమల సరేసరి- న్యూస్ పేపర్ని పట్టుకు కూచుంది. ఇంట్లో పేపర్ని ఆవిడ భర్త కానీ, పిల్లలు కానీ అందనివ్వరట కదా! పైపెచ్చు- చదవడం పూర్తి కాలేదంటూ ఆవిడ భర్త ఆఫీసుకి పట్టుకెళ్తారట పేపర్ని'' కాత్యాయని కుముదిని హడావిడికి అడ్డుకట్టవేసింది.

''ఇంతకీ కౌసల్యగారు వేంచేస్తారటనా..?'' టేబిల్మీద వేళ్ళతో టకటకలాడిస్తూ అంది కుముదిని.

''ఇందాకా ఆవిడే ఫోన్ చేసారు. వాళ్ళ మనవరాల్ని స్కూలుకి పంపి వస్తారట..'' చెప్పింది కాత్యాయని.

''ఊ...అదొక సాకు మాత్రమేలే! కౌసల్యకి పేకాడడం అసలు ఇష్టముండదు. నేను గమనిస్తూనే వున్నాను. మనమిలా ప్రోగ్రాం ఫిక్స్ చేసినప్పుడల్లా, ఏదో కారణం చెప్పి తప్పించుకో చూస్తారు.''

''పోన్లెద్దురూ! ఎవరి ఇష్టాలు వాళ్ళవి. నల్గురం ఒకచోట చేరి టైమ్ స్పెండ్ చెయటం ప్రధానం కానీ, అందరికీ అన్నీ నచ్చాలని లేదుగా!'' కళావతి కూడా టేబిల్ దగ్గర చేరిపోయింది.

''ఇంక ఆలస్యం ఎందుకు? మనం నల్గురం వున్నాం. ఆట మొదలెడితే సరి'' అంటూ కుముదిని పేకముక్కలు నలుగురికి పంచింది.

ఆట మొదలయ్యింది. మధ్యలో మాటల జోరు కూడా కల్సింది. ఎక్కడెక్కడి కబుర్లు, ఎప్పటెప్పటి కబుర్లు వాస్తవ, అవాస్తవిక రంగులద్దుకొని పోటీపడ్తూ ముందుకురుకుతున్నాయి.

''ప్చ్..సీక్వెన్స్ రాలేదు సరికదా- జోకర్ కూడా లేదు. డ్రాప్!'' అంటూ మొదట్లోనే డ్రాప్ చేసింది కుముదిని. చేసేది లేక, పక్కవారి చేతుల్లోని ముక్కల్ని ఆసక్తిగా చూడ్డం మొదలెట్టింది.

''కుముదినీ! వాట్స్ దిస్! నువ్వలా అందరి ముక్కల్లోకి చూస్తే నేనూరుకోను. కావాలంటే విమలకి హెల్ప్ చెయ్యి'' అంది కాత్యాయని తన ముక్కల్ని దాచేస్తూ.

మరో రెండు రౌండ్లకి మిడిల్ డ్రాప్ చేసిన కాత్యాయని కుముదినితో కబుర్లలో పడింది. ఇద్దరికీ దాదాపు ఒకే వయస్సు యాభైకి- అరవైకి మధ్యలో వుంటారు వాళ్ళు. జుట్టుకు రంగులేసుకొని, రూపలావణ్యాలు మెరుగు పర్చుకోవడానికి కొంత సమయం, మరింత డబ్బు వెచ్చించి, వృద్ధాప్యం ఛాయలు కన్పించకుండా జాగ్రత్త పడతారు.

ఇద్దరికీ మనవలున్నారు. కాస్తో కూస్తో కీళ్ళ నొప్పులున్నాయి. అలంకార ప్రాయంగా చెప్పుకోడానికి బ్లడ్ప్రెషర్లు, డయాబటీస్లు వున్నాయి.

వాళ్ళిద్దరే అన్నమాటేమిటి! అక్కడ సమావేశమైన స్త్రీలందరూ ఆ కోవకు చెందినవారే!

కుముదిని, కాత్యాయని క్లాస్మేట్స్. ఇద్దరి భర్తలు పనిచేసింది ఒకే డిపార్ట్మెంట్ కావడం, ఒకే ఊర్లో సెటిల్ అడవడంతో, వారిద్దరి మధ్యా స్నేహం బలపడింది. విమల, కళావతి ఒకే అపార్టుమెంట్లో వుంటారు. కూతురు పెళ్లిలో కుముదినితో కొంత బాంధవ్యం కలవడంతో ఆవిడతోటి పరిచయం పెరిగింది కళావతికి. ఇక కౌసల్య విమలకి దూరపు చుట్టం. ఢిల్లీ, కాన్పూర్, కలకత్తా అంటూ నార్త్ ఇండియా అంతా ఉద్యోగరీత్యా తిరిగిన కౌసల్య భర్త ఫైనల్గా హైదరాబాద్లో సెటిల్ అయ్యారు. విమలతోటి సాన్నిహిత్యం పెరిగిన కౌసల్య వీరితో కల్సింది. అంతమంది మహిళలు ఒక్కచోట కల్సినా భిన్న భిన్న ప్రవృత్తులు వారివి. భిన్నత్వంలో ఏకత్వంలా వాళ్ళ మైత్రి నిరాఘాటంగా సాగిపోతూ వుంది, పేకాటల మాటున.

పిల్లల పెంపకం, చదువులు, ఆ తర్వాత వాళ్ళ పెళ్ళిళ్ళు అయి, భర్తల రిటైర్మెంట్లతో తమకంటూ కొంత సమయం కేటాయించుకొని వారానికో, పక్షానికో ఓ మారు ఒక్కొక్కరింట్లో కలిసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు వాళ్ళు. ఆడవారు కలిసే ఇటువంటి కిట్టీ పార్టీల్లో సహజంగా పేకాట ప్రథమ స్థానం ఆక్రమించుకుంటుంది.

విమలతో కాలక్షేపం కోసం అంటూ కౌసల్యకి ఇలా స్త్రీలందరూ వూసుపోని కబుర్లు చెప్పుకుంటూ పేకాడడం నచ్చేది కాదు. కానీ విమలని నొప్పించలేక కొద్దివారాలు వచ్చిన తర్వాత నెమ్మదిగా వాళ్ళకి తన అభిప్రాయం చెప్పింది.

''ప్రతివారం పేకాడడం కాకుండా, ఒక్కొక్క వారం ఒక్కొక్క కార్యక్రమం పెట్టుకుందాం. ఒకరోజు సరదాగా అందరం ఏ మూవీకో వెళ్దాం. ఒకవారం పిక్నిక్ లాగా ఏ మ్యూజియంకో, జూపార్క్కో వెళ్దాం. సిటీలో ఎన్నో అనాధాశ్రమాలు, వృద్ధుల వసతి గృహాలున్నాయ్. ఒకవారం అక్కడికి వెళ్ళి వాళ్ళతో గడుపుదాం.''

కౌసల్య అభిప్రాయం విని అందరూ తలలైతే వూపారుకానీ సీరియస్గా అమలు చేసేందుకు మాత్రం ముందుకురాలేదు.

మరో అర్ధగంటకి వచ్చి చేరింది కౌసల్య.

''ఏంటండీ కౌసల్యగారూ! ఈ ఒక్కరోజు కూడా మీది కాదా? పనులంటూ ఎవరికి వుండవండీ! మాకు మాత్రం పనులు లేవంటారా? ఎలాగో తెముల్చుకొనో, తప్పించుకొనో రావాలి కానీ...'' కౌసల్యని దాదాపు నిలదీస్తున్నంత గట్టిగా అడిగింది కుముదిని.

''ఎలా రానండీ! నా కూతురు కిన్నెర మెడికల్ కాన్ఫరెన్స్కి పాండిచ్చేరి వెళ్ళింది. ఈ టైంలోనే నా మనవరాలు శ్వేతకి ఎగ్జామ్స్. లెసన్స్ అన్నీ నాకు అప్పజెప్తే తప్ప దానికి తృప్తి వుండదు...'' ఆట మధ్యలో చేయి కల్పడమెందుకన్నట్లు- అక్కడే వున్న ఫెమినా అందుకుంది కౌసల్య.

''మన పిల్లల చదువు బాధ్యత సరే- మనకు తప్పలేదు. ఇక వాళ్ళ పిల్లల బాధ్యత కూడా నెత్తినేసుకోవడం ఎందుకండీ! ఓహ్..ఎప్పుడండీ మనం బయటపడేది ఈ జంజాటం నుండి...'' రెట్టించింది కుముదిని.

ఆవిడ తలని అటు- ఇటూ తిప్పి మాట్లాడుతూంటే ఆవిడ భుజం మీద నాట్యం చేస్తున్న షార్ట్ హేర్ కూడా గమ్మత్తుగా కదులుతూంది. కుముదిని మాటలకి సమాధానం లేదన్నట్లు మౌనంగా వూరుకుంది కౌసల్య.

''మీకో తమాషా ఇన్సిడెంట్ చెప్పనా?'' అంది కళావతి పేకముక్కలు టేబిల్ మీద పడేసి.

అందరూ ఆసక్తిగా చూశారు కళావతి కేసి.

''మొన్నటి రోజు ఏమైందో తెల్సా! నేను బ్యూటీ పార్లర్లో ఫేస్ మీది రింకిల్స్ ట్రీట్ చేయించుకొని, పనిలో పనిగా హేర్ సెట్టింగ్ కూడా చేయించుకొని బయల్దేరేందుకు సిద్ధమవుతుండగా పార్లర్లో పని చేసే అమ్మాయి వచ్చి, మేడమ్! మీ కోసం మీ బ్రదర్ వచ్చారు; బయట కార్లో వెయిట్ చేస్తున్నారంటూ చెప్పింది. యు.ఎస్.లో వున్న నా ఒక్కగానొక్క తమ్ముడు ఇప్పుడిలా ఎలా వూడిపడ్డాడా అనుకుంటూ బయటకు వచ్చి చూద్దునుకదా, కార్లో

వున్నది మా సుపుత్రుడు కిశోర్..'' చెప్పి పకపకా నవ్వింది కళావతి.

''ఇంకానయం! బ్రదర్ అన్నదా అమ్మాయి'' అంటూ మరికొంత కలర్ని జోడించి అర్థవంతంగా నవ్వింది కాత్యాయని. అదేదో పెద్దజోక్ అయినట్లు అందరూ కూడబలుక్కుని విరగబడి నవ్వడం కౌసల్యకి కంపరం పుట్టించింది!



వృద్ధాప్యంలోకి అడుగుపెడ్తున్న స్త్రీలు ముసలితనాన్ని ముందే ఆహ్వానించి అందులో మునిగిపోవడం తప్పే. బాల, కౌమార, యవ్వన దశలని దాటి వృద్ధాప్యంలోకి అడుగుపెట్టడం అన్నది అతి సాధారణంగా జరిగే ప్రకృతి చర్య. ఏ వయసులో ముచ్చట ఆ వయస్సుది. ప్రస్తుత కాలానుగుణంగా సంఘంలో, కుటుంబంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఇదివరకటి ఉమ్మడి కుటుంబాల స్థానే వేరింటి కాపురాలు, ఒంటరి బ్రతుకులు కూడా తప్పనిసరి అవుతున్నాయి. న్యూక్లియర్ ఫామిలీస్‌లో చాలావరకు తల్లిదండ్రులకు చోటు కరువైపోతున్నది. వయస్సు పైబడ్డ పెద్దవారు పిల్లలమీద ఆధారపడి బ్రతకడం అన్నది ఇప్పుడు దాదాపు మృగ్యమనే చెప్పాలి. శరీర సౌష్టవానికి, ఆరోగ్యానికి కావాల్సిన ఆరోగ్య సూత్రాలను పాటించడం మంచిదే. అనారోగ్య పరిస్థితులు తమని చుట్టుముట్టకుండా జాగ్రత్త వహించడం సబబే. కానీ, అలా ఆరోగ్యం పేర హార్మోన్ రీ ప్లేస్‌మెంట్ చికిత్సలు, ఎక్సర్‌సైజులు, ఏరోబిక్స్, జిమ్ములు, జాగింగులు, ఫాషన్లూ, పార్లర్లూ అంటూ వాటి వెంటబడి సమయాన్ని, డబ్బును ఖర్చుపెట్టడం తనకు కొరుకుడు పడలేదు. పరధ్యానంగా ఆలోచిస్తోంది కౌసల్య.

''ఏటండీ! మా జోక్ మీకు నచ్చినట్లు లేదే?'' అంది కుముదిని.

''ఇది హాస్యం కాదండీ! అపహాస్యం! మన పిల్లలు మనల్ని చూచి గర్వపడేటట్లు వుండాలి కానీ, సిగ్గుపడేటట్లు కాదు. కళావతి గారబ్బాయి ఈ జోక్‌ని ఎలా రిసీవ్ చేసుకుంటాడన్న విషయాన్ని ఒక్కమారు ఆలోచించి చూడండి. అప్పుడు మీకు అర్థమౌతుంది'' కొంచెం ఘాటుగానే అంది కౌసల్య.

చిన్నబోయిన కళావతిని చూచి, ''ఊర్కో కౌసల్యా!'' అంటూ వారించింది విమల.

''సారీ కళావతిగారూ! మిమ్మల్ని కించపర్చాలని నేనీ మాటలు అనడం లేదు. ఒక్కమారు మనమందరం వివేకంతో ఆలోచించాల్సిన విషయమిది. మన ముందుతరాల వారికి వాళ్ళని గూర్చి ఆలోచించే సమయం, వివేచనాశక్తి వుండేది కాదు. కాబట్టి అలా వాళ్ళు బ్రతికేసారు. సంతోషంగానా, విచారంగానా అన్నది మనకిక్కడ అప్రస్తుతం. కానీ ఈ తరంలో మనం, ముఖ్యంగా ఇక్కడున్న మనమందరం విద్యావంతులం, గ్రాడ్యుయేట్లం. సొసైటీలో ఒక ముఖ్య వర్గానికి చెందినవాళ్ళం. మన పిల్లల్ని పెంచి, ప్రయోజకుల్ని చేసి, వాళ్ళ కాళ్ళమీద వాళ్ళని నిలబెట్టాం. మన కర్తవ్యాలు పూర్తయ్యాయి. ఇక మన జీవితాలు నిజంగా మనవే! కాని మన ముందున్న ఈ ఫ్రీ టైమ్‌ని మన ఇష్టమొచ్చినట్లు యూజ్ చేసుకోవచ్చునని భావించడం సబబేనంటారా? ఒకప్పుడు అరవై ఏళ్ళు వచ్చేసరికి మన తల్లిదండ్రులు దాదాపు అనారోగ్య పరిస్థితుల్లో వుండేవారు. మొబిలిటీ లేక ఎక్కడికీ కదిలి వెళ్ళేవారు కాదు. కానీ ఇప్పుడు మనమో! ఆధునిక విజ్ఞానం అందించిన వివిధ సౌకర్యాలతో, వైద్య సదుపాయాలతో చురుగ్గా ఆరోగ్యంగా ఒకరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించగల స్థితిలో వున్నాం. అందుకు మనమందరం గర్వించాలి. ఆనందించాలి. ఇలా మనకు సమకూరిన మన జీవితాలని ఎంతో కొంత మన సాటివారికి ఉపయోగపడేందుకు వినియోగిస్తే బాగుంటుంది కదా! ఇన్ని రోజులూ స్వార్థంగా మన కుటుంబాలకే పరిమితమైన మన మన శక్తియుక్తులను, సంఘంలో మన సహాయాన్ని అర్థించే దురదృష్టవంతులకు, అసహాయులకు ఎంతో కొంత వెచ్చించి సహాయపడాలి. ఇదేనండి నేను మిమ్మల్ని కోరేది'' కౌసల్య మాటల్ని పూర్తి కానివ్వకుండానే అందుకుంది కుముదిని.

''అంటే మీరనేదేంటండీ? మన సరదాలని, సంతోషాలని పక్కకునెట్టి సంఘసేవ అంటూ మురికివాడల వెంబడి పరుగులెత్తాలా? మొన్నటి ఆ అనుభవం ఇంకా మరిచిపోలేదు కౌసల్యగారూ! సాయంత్రం వరకూ అనాథాశ్రమంలో గడిపి ఇంటికి వచ్చాక ఏమైంది! మైగాడ్! అన్నం సహించక, నిద్రపట్టక ఆ రాత్రంతా ఎంత కలవరపడ్డానో మీకేం తెల్సు! నేనసలే సెన్సిటివ్..చూడండి, ఏదో ఇలా కులాసాగా

కాలక్షేపం చెయ్యక మనకెందుకండీ లేనిపోని తద్దినాలూ...?'' కుముదిని మాటలు విని నివ్వెరపోయింది కౌసల్య.

నిజమే! ఒక్క కుముదినే కాదు- ఆ మాటకొస్తే చాలామంది, వారికి ఆనందం, ఆహ్లాదం కల్గించే విషయాల పట్ల, పనుల పట్ల ఆసక్తి చూపిస్తారు. అవే ఆచరిస్తారు. తనుమాత్రం ఏమన్న దని..? తమకు అందుబాటులో వున్న సమయాన్ని, విజ్ఞానాన్ని సద్వినియోగ పరుద్దామనే కదా! ఏమో- సద్వినియో గానికి తనిచ్చిన నిర్వచనం, కుముదినికి కొరుకుడు పడినట్లు లేదు...మౌనంగా వుండిపోయింది కౌసల్య.

తన భావాలతో సారూప్యం కుదరని మనుషులతో కల్సి, కలతపడడం కన్నా వారికి దూరంగా వుండ డమే మంచిదన్న నిర్ణయానికి వచ్చిన కౌసల్య, కుము దిని వాళ్ళతో కలవడం క్రమేణా తగ్గించుకుంది. తన వ్యాపకాలు తనవి. తన జీవితాన్ని తన అభిరుచుల మేరకు దిద్దుకోవడమే తన అభిమతంగా భావించి ముందుకు వెళ్ళిపోయింది. తన తీరిక సమయాన్ని మరింత సంఘసేవలో వినియోగించడం మొదలెట్టింది.

''కౌసల్యా! నువ్వీమధ్య టీ.వీలో కన్పించావ టగా- మెంటల్లీ రిటార్డెడ్ చిల్డ్రన్ హోమ్‌లోని పిల్ల లతో గడుపుతూ- కుముదిని చెప్పిందిలే! నువ్వు చేసే సోషల్ సర్వీస్‌కి మెచ్చి ఏ పద్మశ్రీ బిరుదో ప్రదానం చేస్తుందిలే ప్రభుత్వం- అని కూడా ఎద్దేవా చేస్తుం టుంది తను'' అంటూ విమల చెప్పే మాటలను సైతం పట్టించుకోవడం మానేసింది కౌసల్య.


తనేమీ బిరుదులు, పొగడ్తలు, సన్మానాలు ఆశించి చేయడం లేదీ పనులు. అనాధలకి, అసహా యులకి తన వంతు సాయం అందించడమే తన కర్త వ్యంగా భావించి చేస్తోంది.

★★★

ప్రొద్దుటే హడావిడిగా బయల్దేరుతున్న కౌసల్యను అడ్డుకుంది కోడలు కుసుమ.

''అత్తయ్యా! ఉగాది పండుగంటూ ప్రొద్దున్నే లేచి పూజాక్రమం పూర్తి చేసారుకదా! మళ్ళీ ఎక్కడి కండీ బయల్దేరుతున్నారు...? ఇన్నాళ్ళు ఓపిక వుండి ఎక్కడికెళ్ళినా, ఎవ్వరం పట్టించుకోలేదు. కానీ అత్తయ్యా! ఇప్పుడు మీకు హై బి.పీ. డాక్టర్ రెస్ట్ అవసరం అంటున్నారు. ఇలా ఈ పండుగ పూట కూడా బయటకు వెళ్ళకపోతే కాస్తరెస్ట్ తీసుకోవచ్చు కదండీ!''

''చూడమ్మా కుసుమ్! డాక్టర్లు ఇంతుంటే అంతంటారు. ఈ హోమ్ ఫర్ ది ఏజ్డ్ విజిట్ నెలరో జుల ముందే ఫిక్స్ చేసుకున్న ప్రోగ్రాం కదమ్మా! అందర్నీ ప్రోత్సహించి నేనే వెళ్ళకపోతే ఏం బాగుం టుంది చెప్పు? అయినా కుసుమ్- మహా అయితే రెండుమూడు గంటల్లో ఇంట్లో వుండనూ?




అదిగో... అప్పుడే మీ మామయ్య కారు హారన్ ఇస్తు న్నారు. నన్నక్కడ డ్రాప్ చేసి తన ఫ్రెండ్ ఇంటికి వెళ్తా నన్నారు...''

కారు దగ్గరకి నడిచి వెళ్తున్న అత్తయ్య కేసి చూస్తూ అనుకుంది కుసుమ. ''అత్తగారి వ్యాపకమే ఆవిడకి రెస్ట్- కొండంత బలం!''

డబ్బున్నవారికి ప్రత్యేక రూములు, లేనివారికి డార్మెటీలు- వారి వారి ఆర్థిక స్థోమతలను బట్టి సౌక ర్యాలు లభ్యమయ్యే హోమ్ ఫర్ ది ఏజ్డ్ అది. ఆ హోమ్‌లోని వృద్ధుల్ని చూస్తుంటే ఒకవైపు బాధ, మరొకవైపు పూరట కల్గింది కౌసల్యకి.

భర్తలను పోగొట్టుకున్న భార్యలు, భార్యలు మర ణించిన భర్తలు-పిల్లలు లేని వృద్ధ దంప తులు- అనాధలై హోంని ఆశ్రయించిన ఒంటరి అభాగ్యులు, కారణాంతరాల వల్ల వివాహం వాయిదా వేసి తుదకు నా అన్నవారు కరువై హోంలో చేరిన వారు- ఇలా రకరకాల వృద్ధులు ఆ ఆశ్రమంలో తారసపడ్డారు కౌసల్యకి.

ఇంటినుండి తెచ్చిన స్వీట్స్, ఉగాది పచ్చడి ఇన్ మెట్స్‌కి అందిస్తూ అందర్నీ స్నేహపూర్వకంగా పలక రిస్తూ ముందుకు సాగింది కౌసల్య. అలా వెళుతూ, ఒక గది బయట బాల్కనీలో ఏటో చూస్తూ కూచుని వున్న వృద్ధురాలి దగ్గర ఓ క్షణం ఆగిపోయింది. కౌసల్య అడుగుల చప్పుడికి, ఇటు తిరిగిన వృద్ధు రాలు క్షణంలో క్షణం కలవర పడిపోయింది.

''అరే! కుముదిని గారూ! మీరిక్కడా!'' అంటూ దగ్గరికి వస్తున్న కౌసల్యని చూచి, మరింత కుంచించు కుపోయింది కుముదిని. ఆప్యాయంగా భుజం మీద చెయ్యివేసిన కౌసల్యను చూచి కుముదిని నోట మాట రానట్లు వుండిపోయింది.

''కుముదిని గారూ! ఈమధ్య మీ కబుర్లేమీ తెలి యవు నాకు. విమల అయినా వుంటే కొంత తెలిసేది. తను న్యూజిలాండ్ వెళ్ళింది కొడుకు దగ్గరికి. అయినా మీరు అమెరికాలో మీ అబ్బాయి దగ్గర వున్నట్లు విమల చెప్పిందే, ఆ మధ్య కల్సినప్పుడు. ఎప్పుడొచ్చారండి స్టేట్స్ నుండి..?'' అంటూ పలక రించింది కౌసల్య.

ఆనాటి కుముదినేనా ఈ కుముదిని! ఎంత మారి పోయింది? ఈ పదేళ్ళలో రెట్టింపు ముదిమిని పులుముకొని నిస్తేజంగా వున్న ఆవిణ్ణి చూచి ఆశ్చర్యపోయింది. కుముదిని భర్త పోయాడని తెల్సుకొని బాధపడింది కౌసల్య. కన్నబిడ్డల వద్ద ఎడ్జెస్ట్ కాలేక మాతృదేశం వచ్చి వృద్ధా శ్రమంలో చేరిపోయిందని కుముదిని చెప్పగా విని నమ్మలేక పోయింది కౌసల్య.

''ఏం చెప్పమంటారు కౌసల్యా గారూ? ఒకనాడీ వాతావరణాన్ని అస హ్యించుకున్న నాకు భగవంతుడు ఆఖరికి ఇటువంటి శిక్షవేసి ఇక్కడే నీ శేషజీవితం అంటూ శాసించాడు. నాకీ శిక్ష కావా ల్సిందే! నా లైఫ్ స్టైయిల్ నాది, నా జీవిత పంథాని శాసించే హక్కు ఎవరికీ లేదన్నట్లు ఆనాడు విర్రవీ గాను. అప్పు- నా అడుగుజాడల్లోనే నా సంతానం నడుస్తున్నదిప్పుడు. వారి ఆనందమయ జీవితాలకు నేను నిజంగా అవరోధాన్ని అయ్యాను'' బాధపడ్తున్న కుముదినిని మరిన్ని ప్రశ్నలు వేసి బాధపెట్టే ఇష్టం లేక మౌనంగా వుండిపోయింది కౌసల్య.

''భలేవారే! ఈ హోంలో వుండడం మీరు శిక్షగా భావిస్తున్నారా? ఎందరు లేరండి మీ సమ వయస్కు లిక్కడ! వారితోటి జీవితాన్ని ఆనందంగా గడపవచ్చు కదా! చూడండి కుముదిని గారూ! మనం ఓ విషయం మర్చిపోకూడదు. భగవంతుడు మనకు ఏ జీవితం ప్రసాదిస్తే దాన్ని సంతోషంగా స్వీకరించడం లోనే వున్నదండీ మన ఆనందం..తృప్తి..'' ఇంతకన్నా ఆవిడని ఎలా సాంత్వన పరచాలో తెలియలేదు కౌస ల్యకి. కుముదినితో కాస్సేపు గడిపి, మళ్ళీ ఇంకొక మారు వస్తానంటూ అక్కడి నుండి నడిచింది కౌసల్య.

రీవిగా పోతున్న కౌసల్యనే చూస్తూ కుర్చీలో కూల బడ్డ కుముదినిని పలకరించాయి-ఎదుటి టీపాయ్ మీదున్న గ్రీటింగ్ కార్డులు.

ఆరోజు కుముదిని పుట్టిన రోజు.

కెనడా నుండి కూతురు, కాలిఫోర్నియా నుండి కొడుకూ- అమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెల్పుతూ పంపిన అమూల్యమైన గ్రీటింగ్ కార్డ్స్ అవి!

తన గదిలోంచి ట్రింగ్ ట్రింగ్ మంటూ ఫోన్ మోగడంతో ఉలిక్కిపడింది. కుముదిని. పలకరింపు లకై పరితపించే కుముదిని లాంటి అభాగ్యుల పాలిటి కల్పతరువు ఆ ప్రాణం లేని యంత్రం.

కానీ ఎందుకో ఫోన్ రిసీవ్ చేసుకోబుద్ధవలేదు కుముదికి..ఏముంటాయ్ విశేషాలు?

ఎప్పుడూ వినే తన పిల్లల నాలుక చివరి శుభా కాంక్షలే!

అలా మ్రోగుతున్న ఫోన్ కేసి చూస్తూనే వుండిపో యింది కుముదిని.

★